సమావేశంలో మాట్లాడుతున్న మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

రేపు ఘనంగా వడ్డేపల్లి బోనాలు

వరంగల్, ఆగస్టు 30 : ప్రతి ఏడాది మాదిరిగానే వడ్డేపల్లి పోచమ్మ తల్లి బోనాల పండుగను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. శుక్రవారం వడ్డేపల్లి గ్రామపెద్దలు, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలంతా సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని అనవాయితీగా వడ్డేపల్లి పోచమ్మతల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. బోనాల పండుగలో పలహారం బండి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుల మధ్య పోచమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తామని అన్నారు. కులాలు, మతాలకతీతంగా ప్రజలు బోనాల పండుగలో పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం బోనాల పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ అరుణా శ్రవణ్‌కుమార్, ప్రతినిధులు రాంబాబు, సమ్మయ్య, నవీన్, సతీశ్, కుమారస్వామి, భిక్షపతి, వెంకన్న, కోటి, రమేశ్, సంపత్‌రెడ్డి, రవీందర్, రాంచందర్, గణేశ్, సురేశ్, రవి, నాగరాజు పాల్గొన్నారు.

బంధువుల ఇంటికి వచ్చి.. దారి మర్చిపోయి..

మడికొండ, ఆగస్టు 30 : బంధువుల ఇంటికి వచ్చి ఊరు చూసేందుకు బయటికి వచ్చిన ఓ వ్యక్తి దారి తెలియక అయోమయంలో పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన జనగాం అమన్ యూకేలో చదువుకుంటున్నాడు. చుట్టపు చూపుగా మడికొండలోని బంధువు మరకల రాజన్‌బాబు ఇంటికి వచ్చాడు. అయితే, సెల్‌ఫోన్ ఇంట్లో పెట్టి స్కూటీపై ఊరు చూసేందుకు బయటికి వచ్చాడు. తిరిగి బంధువుల ఇంటికి వెళ్లడానికి అడ్రస్ తెలియక, సెల్‌ఫోన్ సైతం లేక, తెలుగు రాకపోవడంతో ఇబ్బంది పడ్డాడు. స్థానికుడు వెంకటేశ్వర్లు గమనించి హెడ్ కానిస్టేబుల్ జయరాజ్‌కు సమాచారం అందించాడు. దీంతో అతడి వివరాలు తెలుసుకొని బంధువులకు అప్పగించారు.

అమన్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న హెడ్ కానిస్టేబుల్ జయరాజ్

'మైనార్టీ గురుకుల అడ్మిషన్లలో వివక్ష'

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 30 : మైనార్టీ గురుకులాల అడ్మిషన్లలో వివక్ష కొనసాగుతుందని, మైనార్టీలకు 80 శాతం కేటాయించాల్సిన సీట్లను డబ్బులకు అమ్ముకుంటున్నారని బీఆర్ఎస్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ నయీముద్దీన్ ఆరోపించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ మైనార్టీ గురుకులాల్లో స్పష్టమైన మార్గదర్శకాలు, చట్టాలు ఉన్నప్పటికీ అర్హులైన విద్యార్థులు ప్రవేశాలు కోల్పోతున్నారని మండిపడ్డారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఉపచట్టాలను ఆమోదించడం ద్వారా మైనార్టీయేతర వర్గాల విద్యార్థులను చేర్చుకుంటున్నారని, దీంతో మైనార్టీ సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులు దుర్వినియోగమవుతున్నాయని ఆరోపించారు. సమావేశంలో నాయకులు మహ్మద్ నయీస్, సయ్యద్ మసూద్, మహ్మద్ అబ్దుల్ కుద్దూస్, షేక్ మహ్మద్, మహ్మద్ షఫీ అహ్మద్, మహ్మద్ మొయినొద్దీన్, మహ్మద్ ఖలీల్, మహ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కమలాపూర్, ఆగస్టు 30: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం అంబాల, శ్రీరాంలపల్లి, శనిగరం, ఉప్పల్, భీంపల్లి, కమలాపూర్ గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను వెంటనే రూపొందించి, ప్రమోషన్లతో ఎంఈవో, జూనియర్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలన్నారు. డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు రావుల రమేశ్, ముత్యాల రఘుపతి, గొడిశాల సత్యనారాయణ, బత్తిని శ్రీరామాంజనేయులు, రాజు, వెంకటేశ్వర్లు, భాస్కర్, భిక్షపతి పాల్గొన్నారు.

'ఎల్ ఆర్ఎస్' పరిశీలనలో నిబద్ధత పాటించాలి

కలెక్టర్ ప్రావీణ్య

ఎల్ఆర్ఎస్‌పై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్, ఆగస్టు 30 :ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో అధికారులు నిబద్ధత పాటించాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ సమావేశ మందిరంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పురోగతిపై గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లెవల్-1లో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తారని అన్నారు. లెవల్-2 స్థాయిలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు ధ్రువీకరిస్తారని తెలిపారు. లెవల్-3 స్థాయిలో కమిషనర్ లేదా డిప్యూటీ కమిషనర్లు నిర్ధారణ చేస్తారని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాకు సంబంధించిన ఎల్ఆర్ఎస్ లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లెవల్ 1,2,3 దరఖాస్తుల స్థాయిలో యాప్ మ్యాప్‌లో సూచిస్తున్న ఎర్రర్ సమస్యలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్, కమిషనర్లు క్షేత్రస్థాయిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల తీరును పరిశీలించారు. ముచ్చర్ల గ్రామంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన తీరు చూసిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుడా వీసీ అజిత్ రెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, టీపీఎస్‌లు శ్రీకాంత్, అవినాష్ పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రం పనులు త్వరగా పూర్తి చేయాలి

కాళోజీ కళాక్షేత్రం పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి కాళోజీ కళాక్షేత్రం పనులను క్షేత్రస్థాయిలో సందర్శించారు. కళాక్షేత్రంలో ఆడిటోరియం, పెయింటింగ్, టైల్స్, ఎలక్ట్రికల్స్, ఆర్ట్ గ్యాలరీ, ప్లంబింగ్ పనులను పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా అదనపు పనులు ఉంటే త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ భీమ్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి చెరువులో పడి విద్యార్థిని మృతి

లిఖిత(ఫైల్)

సుబేదారి, ఆగస్టు 30: వడ్డేపల్లి చెరువులో పడి పాలిటెక్నిక్ విద్యార్థిని మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సుబేదారి పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ సమ్మయ్యనగర్‌కు చెందిన రామ లిఖిత(16) మడికొండ రాంపూర్ వీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతోంది. గురువారం ఇంటి నుంచి కళాశాలకు వెళ్లిన లిఖిత తిరిగి సాయంత్రం ఆరు గంటలకు వడ్డేపల్లి చెరువు వద్ద బస్సు దిగినట్లు స్నేహితురాలికి ఫోన్‌లో చెప్పింది. కూతురు కోసం తల్లిదండ్రులు రాత్రి వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమెను తన క్లాస్‌మేట్ తీసుకొని వెళ్లినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, లిఖిత మృతికి కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

బస్సు నుంచి జారిపడిన విద్యార్థి మృతి

సుబేదారి, ఆగస్టు 30 : ఆర్టీసీ బస్సు నుంచి జారి పడిన విద్యార్థి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. సుబేదారి ఎస్సై ఫణి కథనం ప్రకారం.. హనుమకొండ బాలసముద్రంలోని ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్‌ఇయర్ విద్యార్థి కాతశ్వరపు రోహిత్ ఈ నెల 24న కళాశాలకు వెళ్లి, సాయంత్రం మడికొండలోని ఇంటికి వెళ్లడానికి బాలసముద్రంలో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. సుబేదారి ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్ వద్ద బస్సు డ్రైవర్ మనోహర్ అతివేగంతో అజాగ్రత్తగా నడపడంతో రోహిత్ బస్సు నుంచి కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం ఎంజీఎం దవాఖానకు తరలించగా శుక్రవారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

సుబేదారి, ఆగస్టు 30: దీన్‌దయాళ్ నగర్‌లో గ్యాస్ పేలి, ఇల్లు దగ్ధమైన ఘటన శుక్రవారం జరిగింది. ఏపీలోని ఒంగోలు జిల్లాకు చెందిన గురువారెడ్డి భార్యతో కలిసి దీన్‌దయాళ్‌నగర్‌లో అద్దెకు ఉంటూ కూలి పనిచేసుకుంటున్నాడు. శుక్రవారం భార్యాభర్తలు ఇద్దరూ పనికి వెళ్లగా ఇంట్లో ఉన్న వంట గ్యాస్ సిలిండర్ పేలి మంటలు అంటుకున్నాయి. దీంతో ఇల్లు దగ్ధమైందని సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 21 మందికి జరిమానా

సుబేదారి,ఆగస్టు 30: హనమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 21 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఐదుగురికి కూడా జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

న్యూశాయంపేటలో కారు బీభత్సం

పలువురికి గాయాలు

సుబేదారి,ఆగస్టు30 : హంటర్‌రోడ్డు న్యూశాయంపేట జంక్షన్‌లో శుక్రవారం కారు బీభత్సం సృష్టించింది. డ్రైవర్ అజాగ్రత్తగా అతివేగంతో వచ్చి న్యూశాయంపేట జంక్షన్‌లో పలు వాహనాలను ఢీకొట్టి, ఓ షాపులోకి దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కారు డ్రైవర్ మద్యం సేవించి డ్రైవింగ్ చేయడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న సుబేదారి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

యువతి అదృశ్యం

ఆత్మకూరు, ఆగస్టు 30 : మండల కేంద్రానికి చెందిన యువతి అదృశ్యమైంది. ఎస్సై జక్కుల పరమేశ్వర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తెప్పలి రమేశ్, దుర్గ దంపతులు శుక్రవారం వరంగల్‌లోని భద్రకాళి గుడికి వెళ్లి, ఇంటికి వచ్చే సరికి వారి పెద్ద కూతురు విజయలక్ష్మి(19) కనబడలేదు. చుట్టుపక్కల వారు, బంధువుల ఇండ్లలో వెతికినా కనిపించలేదు. దీంతో ఆమె తండ్రి రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎనిమిది ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఐనవోలు, ఆగస్టు 30 : మండలంలోని నందనం ఆకేరు వాగులో నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు సోదాలు నిర్వహించి, ఆరు ఇసుక ట్రాక్టర్లు, రెండు మట్టి ఇసుకను ఫిల్టర్ చేసే ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్లను సీజ్ చేసి, డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఏఎస్సై, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

శాయంపేటలో ఉపాధిహామీ సోషల్ ఆడిట్

గ్రామ సభలో వివరాలు వెల్లడిస్తున్న డీఆర్పీ

శాయంపేట, ఆగస్టు 30 : శాయంపేట గ్రామపంచాయతీలో ఉపాధి హామీ సోషల్ ఆడిట్ బృందం శుక్రవారం గ్రామ సభ నిర్వహించింది. పరిశీలకులుగా డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్పీలు గత సంవత్సరం చేసిన ఉపాధి పనుల్లో లోపాలను బయటపెట్టారు. పంచాయతీరాజ్ అధికారులు శాయంపేటలో చేపట్టిన పనులను చూపించలేదని తెలిపారు. అసలు పనులు జరిగాయా లేదా అనే అనుమానాలు వ్యక్తం చేశారు. అలాగే, జీపీ నిర్వహించే ఫిర్యాదులు, జాబ్ కార్డు అప్డేషన్, డిమాండ్, పని కోరే రికార్డ్ వంటి ఏడు రికార్డులు అప్డేట్ లేవని సభలో వెల్లడించారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు కూడా కనిపించలేదని పేర్కొన్నారు. మిగిలినవి రీప్లేస్ చేయాలని సూచించారు. రోజుగార్ దివాస్ క్రింద ప్రతినెల 4వ శనివారం సమావేశాలు పూర్తిస్థాయిలో నిర్వహించలేదని వెల్లడించారు. ఉపాధి పనులు చేసిన చోట నేమ్ బోర్డులు పెట్టలేదని ఆరోపించారు. అనంతరం కొత్త జాబ్ కార్డులను అందించారు. సమావేశంలో పీజీఎస్ ఏపీవో అనిత, ఈసీ రమేశ్ పాల్గొన్నారు.

ఆర్బిట్ స్కూల్‌లో వైద్య శిబిరం

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

హసన్‌పర్తి, ఆగస్టు 30 : మండలంలోని ఎల్లాపూర్ శివారులోని ఆర్బిట్ స్కూల్‌లోవిద్యార్థి అనుమాల నర్సింహారెడ్డి జ్వరంతో మృతి చెందిన నేపథ్యంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మదన్‌మోహన్ ఆధ్వర్యంలో స్కూల్‌లో శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి, మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పాఠశాలలోని టాయిలెట్స్, వంటగది, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మహేందర్, వైద్యులు సురేశ్ పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

మండలంలోని ఆర్బిట్ స్కూల్, గ్రీన్‌వుడ్, కేజీబీవీ పాఠశాలల్లో ఎంఈవో రవీందర్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లోని టాయిలెట్స్, వంటగదిని పరిశీలించారు. ప్రైవేట్ స్కూళ్ల రెసిడెన్షియల్ అనుమతులపై ఆరా తీశారు. పాఠశాలలోని మౌలిక సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని పాఠశాలలపై రిపోర్టు తయారు చేసి, ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. అనుమతి లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

అభ్యసనా సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి

ఐనవోలు, ఆగస్టు 30 : విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో సామర్థ్యాలను పరీక్షించి, ఎల్ఐపీకి సంబంధించిన బేస్‌లైన్ టెస్ట్ వివరాలను పరిశీలించారు. అనంతరం హెచ్‌ఎం వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఎల్ఐపీని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. నోడల్ అధికారి ఆనందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవ కమిటీలకు అవగాహన

కమలాపూర్/మడికొండ/ ఆత్మకూరు/, ఆగస్టు 30 : గణేశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఉత్సవ కమిటీలకు పోలీసులు శుక్రవారం అవగాహన కల్పించారు. కమలాపూర్‌లో సీఐ హరికృష్ణ, మడికొండలో ఇన్‌స్పెక్టర్ కిషన్, ఆత్మకూరులో ఎస్సై పరమేశ్వర్ పాల్గొని ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించారు. మండపాలకు పోలీసుల అనుమతి తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసుకోవాలని సూచించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి

వరంగల్, ఆగస్టు 30 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున వాటి నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. నీరు నిల్వ ఉండే వస్తువులు, వాడని పాత సామగ్రి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఐదు రోజుల కంటే ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే అందులో దోమలు గుడ్లు పెట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైగా పాటించాలని సూచించారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 27 : హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో శుక్రవారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. అండర్-8, 10, 12, 14, 16, 18, 20 బాయ్స్ అండ్ గర్ల్స్‌కు నిర్వహించిన వివిధ రకాల ఈవెంట్స్‌లో క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. కార్యక్రమంలో కార్యదర్శి సారంగపాణి, కోచ్ శ్రీమన్, మూర్తి పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయాలి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 30 : కాకతీయ యూనివర్సిటీలో పరీక్షలు పూర్తయినా ఫలితాలు విడుదల చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు మండిపడుతున్నారు. మొన్న డిగ్రీ సెమిస్టర్ నేడు ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు ప్రకటించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఈ మేరకు మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ 6వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేయాలని హనమకొండలోని ఆదర్శ న్యాయ కళాశాల విద్యార్థులు శుక్రవారం వర్సిటీ కంట్రోలర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఫలితాలు రాకపోవడంతో ఎల్ఎల్ఎం కౌన్సెలింగ్‌కు హాజరు కాలేకపోతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా పరీక్ష ఫలితాలను వేగవంతంగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

శాయంపేట, ఆగస్టు 30 : తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐపీపీబీ బిజినెస్ కరెస్పాండెంట్ మారేపల్లి క్రాంతి కుమార్, రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ సముద్రాల లింగమూర్తి సూచించారు. ఈ మేరకు శాయంపేటలో శుక్రవారం వారు అవగాహన సదస్సు నిర్వహించారు. పోస్ట్ ఆఫీస్ సేవల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పోస్ట్ ఆఫీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆశలు రేకెత్తిస్తున్న అల్పపీడనం

- వాతావరణ శాఖ రైతులకు బిగ్ అలెర్ట్
- ఉత్తర తెలంగాణాలో భారీ వర్షాలు
- సాగు నీటి ప్రాజెక్టులు నిండే అవకాశం
- అన్నదాతల్లో చిగురించిన ఆశలు

హనుమకొండ సబర్బన్, ఆగస్టు 30 : ఈశాన్య బంగాళా ఖాతంలో ఏర్పడిన అతి భారీ అల్పపీడనం అన్నదాతల్లో ఆశలు రేకెత్తిస్తున్నది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేసిన ప్రకటనపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. టీవీల ముందు కూర్చుని వర్షాలకు సంబంధించిన వార్తలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. రెండు రోజుల క్రితం బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం బలపడి రాష్ట్రానికి మంచి వర్షాలను తీసుకొస్తున్నట్లుగా అధికారులు ప్రకటించారు. దీనికి తోడు ప్రైవేట్‌గా వాతావరణ గమనాన్ని పరిశీలించి ప్రజలకు వెల్లడించే యూ ట్యూబర్లు సైతం వర్షాల పట్ల బిగ్ అప్‌డేట్లు ఇస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో రేపు తీరం దాటే తుఫాను సరిగ్గా రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఖమ్మం జిల్లాల్లోకి ప్రవేశించే సమయంలోనే ఉత్తర భారతం నుంచి వచ్చే బలమైన గాలులను ఢీకొని తుఫాను కాస్తా వాయుగుండంగా మారనుందని తెలుస్తున్నది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వర్షాలు పడనున్నాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతాయని వెల్లడిస్తున్నారు. ఇక్కడే కాకుండా ఈ వర్షాలు మహారాష్ట్రలోని నాందేడ్, ఔరంగాబాద్, నాసిక్ వరకు విస్తరిస్తాయని పలువురు యూట్యూబర్లు అంచనా వేస్తున్నారు. దీంతో ఇన్నాళ్లు ప్రాజెక్టుల్లో చుక్క నీరు చేరక దిగులుగా ఉన్న రైతుల్లో ఒకింత ఆశలు చిగురించాయి. ఉత్తర తెలంగాణ వరప్రదాయని అయిన శ్రీరాం సాగర్ నిండే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మహారాష్ట్రలోని గైక్వాడ్ ప్రాజెక్టు నిండినట్లయితే శ్రీరాంసాగర్ సులభంగా నిండుతుంది. ఈ వర్షాలు యాసంగి పంటకు భరోసా ఇచ్చినట్లవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

భద్రకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు

వరంగల్, ఆగస్టు 30 : నగరంలోని ప్రసిద్ధ భద్రకాళి అలయానికి భక్తులు పోటెత్తారు. చివరి శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచి దర్శనం కోసం బారులు తీరారు. అమ్మవారి దర్శనానికి రెండు, మూడు గంటల సమయం పట్టింది.

కనుల పండువగా లక్కాకులమ్మ జాతర

దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

భీమదేవరపల్లి, ఆగస్టు 30 : మండలంలోని గట్లనర్సింగాపూర్‌లో లక్కాకులమ్మ జాతర కనుల పండువగా జరుగుతున్నది. గుట్టపైన సొరంగంలో వెలిసిన అమ్మవారిని దర్శించుకునేందుకు శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అమ్మవారి ఆలయం పక్కనే గౌషేపాక్ దర్గా ఉంది. మత సామరస్యానికి ప్రతీకగా హిందూ ముస్లింలు అమ్మవారిని దర్శించుకుని దర్గాకు వెళ్తారు. చుట్టూ పచ్చని పంటపొలాలు, ప్రకృతి రమణీయత, ఆహ్లాదకర వాతావరణం యువతను కట్టిపడేస్తున్నది. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు వాటిల్లకుండా ఆలయ చైర్మన్ మండల రవీందర్, వ్యవస్థాపక చైర్మన్ కుక్కముడి ప్రభుదాసు సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు జనగాం సుధాకర్, చల్లూరి రవీందర్, రాంపల్లి రాజవీరాచారి, ఆకుల రంగయ్య, గడల రాజయ్య, బామండ్లపల్లి ప్రభాకర్, మండ శ్రీధర్, నీలిగొండ వీరస్వామి, గుర్రపు కొంరయ్య, రాచర్ల శివ, ఏనుగుల మధు, సట్ల శ్రీనివాస్, మంత్రి కుమారస్వామి, బామండ్లపల్లి కనకయ్య పాల్గొన్నారు.

నేడు ఐనవోలు నందీశ్వరస్వామికి అభిషేకం

ఐనవోలు, ఆగస్టు30 : ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలోని నందీశ్వరస్వామికి ఆలయ చరిత్రలో మొట్టమొదటిసారిగా శనివారం అభిషేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధానార్చకుడు పార్లపాటి రవీందర్ తెలిపారు. బహుళ త్రయోదశి పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతి నెలా బహుళ త్రయోదశి రోజు నందీశ్వర అభిషేకం జరుగుతుందని, పాల్గొనే భక్తులు ముందుగా ఆలయంలో పేర్లు, గోత్రనామాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

శ్వేతార్కలో నేటి నుంచి గణపతి ఉత్సవాలు

కాజీపేట, ఆగస్టు 30 : కాజీపేటలోని శ్రీశ్వేతార్క మూల గణపతి దేవాలయంలో శనివారం నుంచి సెప్టెంబర్ 17 వరకు గణపతి నవరాత్రి ఉత్సవాలు, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు అయినవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ తెలిపారు. శుక్రవారం ఆలయంలో వారు మాట్లాడుతూ ఏటా నిర్వహించినట్లే ఈ ఏడాది కూడా 16 రోజుల గణపతి నవరాత్రులను గురు మదనానంద సరస్వతీ పీఠాధీశులు మాధవానంద సరస్వతీస్వామి ఆశీస్సులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. కార్పొరేటర్ జక్కుల రవీందర్, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అయినవోలు వెంకటేశ్వర శర్మ, వేదపండితులు త్రిగుళ్ల శ్రీనివాస్‌శర్మ, ఆలయ ఇన్‌చార్జులు శ్రీనివాస్, భాస్కర్‌రావు, సదానందం, రాజమోహన్, రాజిరెడ్డి, మేనేజర్ లక్క రవి, అసిస్టెంట్ మేనేజర్ దుర్గం సుధీర్, పీఆర్వో ఐతా మణిదీప్ పాల్గొన్నారు.

నేటి నుంచి అంబాల-హనుమకొండ బస్సుల పునరుద్ధరణ

పరకాల, ఆగస్టు 30 : పరకాల, కంఠాత్మకూర్, అంబాల మీదుగా హనుమకొండకు బస్సులను శనివారం నుంచి పునరుద్ధరించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రవిచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో కంఠాత్మకూర్ శివారులోని వాగుపై తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో ఆ రూట్‌లో బస్సులను నిలిపి వేసి, శనిగరం అంబాల మీదుగా బస్సులను నడిపినట్లు పేర్కొన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టి, వాగుపై తాత్కాలిక రోడ్డుకు మరమ్మతు చేయడంతో తిరిగి పరకాల, అంబాల, హనుమకొండ బస్సులను తిరిగి కంఠాత్మకూర్ మీదుగా పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. ఈ రూట్‌లోని గ్రామాల ప్రజలు, ప్రయాణికులు గమనించి బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవీందర్

పరకాల, ఆగస్టు 30 : బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ బాధ్యుడు రవీందర్ అన్నారు. నడికూడ మండలం వరికోల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే తమ లక్ష్యాలను సాధించేలా నిరంతరం సాధన చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 18001029976 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, ఆర్గనైజేషన్ బాధ్యులు శ్రీలత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ఆసియా ప్రతిభ

ఆసియాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నీరజారెడ్డి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 30 : కర్ణాటక రాష్ట్రంలో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో పతకాలు సాధించిన ఆసియాను శుక్రవారం టీఎంఆర్ఎస్(జేసీ) ప్రిన్సిపాల్ నీరజారెడ్డి అభినందించారు. అందరూ ఆసియాను ఆదర్శంగా తీసుకొని చదువుతోపాటు ఆత్మరక్షణ కోసం కరాటే, మార్షల్ ఆర్ట్స్ వంటి విద్యలు నేర్చుకోవాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు, కాంస్య పతకాలు సాధించిన ఆసియా తమ కాలేజీలో చదువుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. టీఎంఆర్ఎస్(జేసీ)లో ఇంటర్ బైపీసీ చదువుతున్న ఎండీ ఆసియా కటాస్ విభాగంలో బంగారు పతకం, అండర్-16 స్పారింగ్‌లో కాంస్యం సాధించింది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వరంగల్, ఆగస్టు 30 : హనుమకొండ బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ చౌరస్తా, బస్టాండ్ రోడ్డు, అలంకార్ జంక్షన్, గాంధీనగర్, టైలర్ స్ట్రీట్, ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HOSPITAL STAFF
★Pharmacy Boys, Operation Theater Boys & Receptionist / సిస్టమ్ ఆపరేటర్స్ కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2 PM.
NTW-0418

BUSINESS OFFER
★చాలా పెద్ద చదువులు చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు సువర్ణావకాశం. అతి తక్కువ పెట్టుబడితో ప్రతి నెల అత్యధికంగా సంపాదించుకునే సువర్ణావకాశం. సంప్ర: సెల్: 9502940056.
NTW-326315

PLOTS FOR SALE

★వరంగల్ నాయుడు పెట్రోల్‌పంప్, వరంగల్ నుండి ఖమ్మం హైవే రోడ్‌కు దగ్గరలో 248 చ.గ.లు Size: 64x35, 33 ఫీట్ల రోడ్ గల ప్లాట్ అమ్మబడును. సంప్ర: 9676147575
NTW-323349

To-Let / Rent
★ 3BHK Residence 2400 Sft. Semi Furnished as per vastu, Lift & Generator, Car Parking available for Rent @ Reddy colony near Vikas H.School, HNK. 8886996262.
KMM-

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565